# తెలుగు శ్రీసభ పీఠకాపరుల సమష్టి జూబిలి 2025 లేఖ!!
# సాధారణ జూబిలి 2025
# ప్రధాన అంశం:"నిరాశను నివృత్తిచేయు నిరీక్షణ" (రోమా 5:5)

ప్రభువునందు ప్రియులైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలోని పూజ్య గురువులకు, దైవాంకితులకు, విశ్వాసులందరికీ సకల మానవుల రక్షకుడైన యేసుప్రభు జయంతి జూబిలీ 2025 సంవత్సర శుభాశీస్సులు. పరిశుద్ధ ఫ్రాన్సిసు పోపుగారు ప్రకటించిన 2025 సాధారణ జూబిలి 'విశిష్ట దైవనుగ్రహాలు' మీకందరికీ, మనందరికీ లభించాలని ఆశిస్తున్నాము. ఈ చారిత్రాత్మక పవిత్ర జూబిలి సందర్భంగా, తెలుగు ప్రాంతీయ కతోలిక పీఠకాపరులందరం కలిసి సమష్టిగా ఈ కాపరిసేవా లేఖను ఆశీర్వాదపూర్వకంగా అందిస్తున్నందుకు ఆనందిస్తున్నాము.

**తెలుగునాట కతోలిక క్రైస్తవం**

సువిశాల భారతదేశంలోని యావత్తు కథోలిక శ్రీసభలో, జంట తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ శ్రీసభ దాదాపు 20 లక్షల విశ్వాసులతో విశిష్టమైన స్థానం కలిగిఉన్నది. దీనిని బట్టి యేసుక్రీస్తు విశ్వాసులైన మీ అందరికీ, ఉపదేశులకు, దైవాంకితులకు, గురువులకు అభినందనలు. ఈ సమయంలో గత-ప్రస్తుత, విదేశీ-స్వదేశీ మిషనరీలందరికీ శిరమువంచి నమస్కరించుచున్నాము. మన యువతి యువకులు ఎందరో దైవ పిలుపును కృతజ్ఞతతో అందుకుని గురువులుగా, కన్యలుగా, సోదరులుగా ప్రభుసేవచేస్తూ, విశ్వాసులను పటిష్టపరుస్తూ, క్రైస్తవేతరులకు సువార్త వెలుగుల సేవాసాక్ష్యము ఇస్తున్నందుకు గర్వించుచున్నాము. క్రైస్తవ విశ్వాసులైన మీకుటుంబాలనుండి చాలామంది, దైవపిలుపును అందుకుని దేశవిదేశాల్లో మిషనరీలుగా సేవలందిచటాన్ని, తెలుగునాట శ్రీసంఘాల విశ్వాస త్యాగాలకు బలమైన సంకేతంగా భావిస్తున్నాం.

అంతేగాక, శ్రీసభ సేవాకార్యక్రమాల ద్వారా ఉన్నతవిద్యను అభ్యసించి, గృహస్థ క్రైస్తవులుగా పలురంగాలలో ఎనలేని సేవలు అందించడం, తద్వారా కతోలిక విశ్వాసానికి సాక్ష్యంఇవ్వడం అదనపు గర్వకారణం! గౌరవ ఉపదేశులు, గృహస్థ క్రైస్తవ పిలుపులో జీవిస్తూ, క్షేత్రస్థాయిలో, గ్రామగ్రామాల్లో, కోరుక్రైస్తవులతో, క్రొత్త, పాత క్రైస్తవులతో మమేకమవుతూ, గురుమండల గురువులకు కుడిభుజమై సంఘాలను సంరక్షిస్తున్నారు. వీరి అమూల్య సేవలకు రెండు చేతులెత్తి కృతజ్ఞతాంజలు అర్పిస్తున్నాం!ఈవిధంగా మన రెండు తెలుగు రాష్ట్రాల్లో, వివిధ అద్వితీయ సేవలతో, తెలుగునాట శ్రీసభ దేదివ్యమానంగా ప్రకాశిస్తుందనుట అతిశయోక్తి కాదు! దేవునికి మహిమ, ఘనత చెల్లునుగాక!

**సరికొత్త సాధారణ జూబిలి 2025: సంసిద్ధతాకాలం**

2000 సంవత్సర మహాజూబిలి వేడుకలతో ప్రపంచమంతా క్రీస్తుశకం మూడవ సహస్రబ్దిలోకి ప్రవేశించింది. కాలం వేగంగా దొర్లిపోతుండగా, సాధారణ జూబిలి 2025 వేడుకలకు సమయం రానే వచ్చింది. ఈ జూబిలి వేడుకలకు సంసిద్ధపడుటకు 2023 ను అధ్యయన సంవత్సరంగా (Year of Learning) విశ్వశ్రీసభ ప్రకటించింది. రెండవ వాటికను మహాసభ ఆమోదించిన నాలుగు సంవిధాన పత్రాలను చదివి, ధ్యానించి, వాటిని స్థానిక సంఘాలకు అన్వయించుకోవాలని ఉపదేశించింది. అదేవిధంగా 2024 ను ప్రార్థనా

సంవత్సరంగా (Year of Prayer) ప్రకటించింది. అధికారిక "జూబిలి సంవత్సర ప్రార్థన"ను కూడా అందించింది. **2024** సంవత్సరమంతా దాదాపు అన్ని గురుమండలాల్లో, గ్రామాల్లో ప్రజలు ఈ జపమును భక్తితో ప్రార్థిస్తున్నారని తెల్పుటకు సంతోషిస్తున్నాము.

**జూబిలి పుట్టుపూర్వోత్తరాలు**

జూబిలి పూర్వోపరాలను పరిశీలిస్తే, దీని మూలాలు లేవియకాండం **25**వ అధ్యాయ పరమార్థంతో, యేసుప్రభు లూకా **4:18**లో నజరేతు మందిర "తన మిషన్ ప్రకటన" యొక్క పరమానందంతో ముడిపడి ఉన్నవి. వాటి ప్రకారం జూబిలిసంవత్సరం అతి పవిత్రం, అత్యంత ప్రశస్తం. అది దేవుని విశిష్ట అనుగ్రహ కాలం, మనుషులకు సఖ్యతా సంవత్సర సమయం. అనగా మనిషి దేవుడితో, పొరుగువారితో, సకల సృష్టితో, సఖ్యతా సంబంధాలు తిరిగి నెలకొల్పుకొనుటకు తిరుగులేని అవకాశం. పైపై ఆడంబరాల పండుగలకే పరిమితం కాకుండా "అంతరంగ నూత్నీకరణ, శత్రువుల మన్నింపు, పాపసంకెళ్ల నుండి విడుదల, అందరితో సత్సంబంధాలు, ఆధ్యాత్మికస్వేచ్ఛ అనుభవం, పవిత్రాత్మ నడిపింపు" వంటి వాటికి అత్యంత ప్రాముఖ్యతనివ్వాలి. అవి పొందలేకపోతే ఈ పవిత్రకాల వరాలను చేజేతుల పోగొట్టుకున్నట్లే!

**జూబిలి ప్రకటన: ప్రారంభం, ముగింపు**

పరమపవిత్ర త్రిత్వదేవుని రెండవవ్యక్తి, ఆదినుండి ఉన్న వాగ్దేవుడు (యోహా **1:1**) మరియగర్భంలో మానవజీవం పోసుకుని, ఈ భూమి మీద జన్మించిన **2025** వసంతాల ఉత్సవమును, పరిశుద్ధ ఫ్రాన్సిసు పోపుగారు జూబిలి సంవత్సరముగా "నిరీక్షణ నిరాశ పరచదు" (Spes non Confundit) అను ఆదేశపత్రం ద్వారా చేసిన ప్రకటన, కతోలికలోకాన్ని ఆనంద పరవశం చేసింది! ఈ జూబిలి వేడుకలను విశ్వశ్రీసభ పక్షాన డిసెంబరు **24, 2024** క్రీస్తుజయంతి జాగరణ పూజాప్రార్థనలతో పరిశుద్ధ ఫ్రాన్సిసు పోపుగారు రోము నగరంలోని భక్త పేతురు బృహద్దేవాలయ "కృపాద్వారం" తెరచి ప్రారంభిచారు. ప్రపంచంలోని ఇతర కతోలిక పీఠమండలాలన్నింటిలోనూ, స్థానిక పీఠకాపరి తన ప్రధాన ఆసన దేవాలయంలో డిసెంబర్ **29**న, **2024** తిరుకుటుంబ పండుగరోజున అలంకరించిన సిలువ ప్రదక్షణతో, గురువులతో, దైవాంకితులతో, విశ్వాసులతో కలిసి ప్రారంభిస్తారు. అదే పవిత్రకుటుంబ పండుగ రోజున, అనగా డిసెంబర్ **28, 2025** నాడు అధికారికంగా ఈ పవిత్ర వసంతాన్ని ముగిస్తారు. విశ్వశ్రీసభ తరుపున జనవరి **6, 2026**న క్రీస్తు సాక్షాత్కార మహోత్సవంనాడు పోపుగారు జూబిలి **2025** వసంతాన్ని పరిపూర్తి చేస్తూ శుభం పలుకుతారు.

**క్షేత్రస్థాయి కార్యక్రమాలు**

ఈ సంవత్సరాన్ని మొత్తం నిరీక్షణ వెలుగులతో నింపుటకు పలువిధ కార్యక్రమాలను, వేడుకలను విశ్వశ్రీసభ క్యాలెండర్‌ను ప్రకటించింది. వాటికి తోడుగా పీఠకాపరులు, విశ్వాసుల సమాలోచనలతో జాతీయస్థాయిలో, ప్రాంతీయస్థాయిలో, పీఠస్థాయిలో, గురు మండలస్థాయిలో, వెరసి గ్రామస్థాయిలో అధ్యయన, విశ్వాస వికాస, సత్యోపదేశ, సంవాద ఆశయాలలో వివిధ కార్యక్రమాలు ఏర్పాటు చేసుకొనే సౌలభ్యాన్ని ఇచ్చింది. తెలుగు పీఠకాపరులు వారివారి పీఠమండలాల్లో ఏర్పాటు చేసుకొను కార్యక్రమాలతో పాటు, ప్రాంతీయ స్థాయిలో, తెలుగు శ్రీసభలో రెండు అధ్యయన పూజాప్రార్థనా వేడుకలను నిర్వహించటకు నిశ్చయించాము. ఒకటి హైదరాబాదులో, రెండవది విజయవాడలో. వాటి విధివిధానాలను తగుసమయంలో తెలియపరుస్తాము. దానికి మీ అందరి భాగస్వామ్యం, సహాయ సహకారాలు చాలా అవసరమని

ఇప్పుడే తెలియపరుస్తున్నాం.

**సహజ ఆశాభావం-క్రైస్తవ నిరీక్షణ:**
అవినీతి, అన్యాయ, అశాంతి, అసమానత శక్తుల విజృంభణతో, మంచి కన్నా చెడుదే పైచేయి అన్నట్లుగా కనిపించే పరిస్థితుల్లో, నిరాశ, నిస్పృహలతో కుమిలిపోతున్నది నేటి ప్రజాలోకం. ప్రజలకు భవిష్యత్తును గూర్చిన ఆశాజనక దృఢనమ్మకాన్ని, 'అంతిమ విజయం మంచికే' నను భయంలేని భరోసానిస్తుంది "నిరాశను నివృత్తిచేయు నిరీక్షణ" అను జూబిలి ప్రధాన అంశం. దేవుడు మనిషి రక్తంలోనే, మనిషి స్వభావంలోనే 'ఆశాభావం' అను సహజ దైవిక ధర్మాన్ని ఉంచాడు. 'ఆశ' అను ఇంధనం లేకపోతే మనిషి జీవించడం దుస్సాధ్యం. క్రైస్తవ ఆశాభావం దైవానుగ్రహంతోనిండి 'నిరీక్షణ సుగుణం'గా రూపాంతరం చెందుతుంది. ఈ క్రైస్తవ నిరీక్షణ విశ్వాసుల్లో ఒక జ్వాలగా మండాలని, ఆజ్వాల కాగడగామారి, చెడును కాల్చి వేసి, మంచిని వెలిగిస్తుందన్న ఆనంద అభయానిస్తుంది. విశేషవిధంగా ఈ జూబిలీ సంవత్సరంలో ఈ ఆశాజ్వాలతో ఇతరులను వెలిగిస్తూ, లోకమంతా ఆవరించిన చిమ్మచీకట్లను పారద్రోలుతూ, దృఢమైన గుండెలతో, ప్రశాంత మనస్సులతో, నిరీక్షణశక్తితో భవిష్యత్తు పట్ల ఆశాజనకంగా ప్రకాశిద్దాం. 'దేవునికి అసాధ్యమైనది ఏదీ లేదు' (లూకా 1:37) అను కన్యమరియ మాటలలోని విశ్వాసఇంధనంతో, వినూత్న జూబిలీ అనుగ్రహాలతో, దైవరాజ్య సంపూర్ణ స్థాపనకై జూబిలీ కంకణం కట్టుకుందాం!

**దివ్యపూజాప్రార్థనల క్రమము:వివిధ వేడుకలు**
క్రీస్తు సిలువ యాగమైన దివ్యపూజాబలి "శ్రీసభ జీవితానికి, సువార్తప్రకటనా ధర్మాలకు మూలం, శిఖరం"(L.G 11; CCC 1324) అని కతోలిక విశ్వాసం ఘంటాపథంగా బోధిస్తుంది. దానితోపాటు విశ్వాసులందరూ 'నిండుమనస్సుతో, పరిజ్ఞానముతో, చురుకుగా' పూజాప్రార్థనలలో పాల్గొనాలని ఆహ్వానిస్తుంది (SC 14). కాబట్టి ఈ జూబిలీ సంవత్సరములో విశ్వశ్రీసభ నిర్దేశించు పూజా ప్రార్థనలను, అర్థవంతంగా, క్రమబద్ధంగా, భక్తియుతంగా కొనియాడుటకు 'జూబిలీ దైవార్చన క్రమము' అనుగ్రంథాన్ని అందించింది విశ్వశ్రీసభ. సంవత్సరమంతా కొనియాడు వివిధ ప్రత్యేక పూజాఉద్దేశాల ప్రకారం, విశేషవిధంగా ఈ జూబిలీ ప్రారంభ, ముగింపు వేడుకలు జరుపుటకు ఈ గ్రంథాన్ని వినియోగించాలి. దీనికి అదనంగా, జూబిలీ ప్రార్థనతో పాటు ఒక "పాటను" కూడా అధికారికంగా అందించింది. వీటన్నింటిని మన మాతృభాష తెలుగులో, దైవార్చన సమితి ఇప్పటికే అందించింది. "ఆత్మలో, సత్యములో ఆరాధించు ప్రజగా" (యోహా 4:23) వీటిని ఉపయోగించుకుంటూ మన దైవారాధనను జూబిలి వెలుగులతో నింపుదాం! దైవానుగ్రహాలను కోకొల్లలుగా పొందుదాం!

**పరిపూర్ణ కృపాఫలాలు (Plenary Indulgences)**
ఈ జూబిలీ సంవత్సరమంతా అనేక పుణ్యకార్యాలు, కారుణ్యక్రియలు, తీర్థయాత్రలు చేపట్టాలని శ్రీసభ ఆహ్వానిస్తుంది. జగద్గురువులు ఫ్రాన్సిసు పోపుగారు పాపపరిహార "పరిపూర్ణ ఫలాలు" అను ఆదేశపత్రం ద్వారా వాటిని ప్రకటించారు. ఈ పవిత్ర సంవత్సరంలో లభించు పాపపరిహార పరిపూర్ణ ఫలాలను పొందుటకు వలయు నిర్దేశాలను, విధులను ఆ పత్రంలో పొందుపరిచారు. కృపా సంపన్నుడైన దేవదేవుని అపారమైన ప్రేమను, కరుణను, మన్నింపును కేవలం మానవక్రియల ద్వారా పొంద సాధ్యంకాదు. అయినప్పటికీ 'పరలోక రాజ్యపు తాళపుచెవులను నీ చేతిలో పెడుతున్నాను' (మత్త 13:19) అను దైవానుగ్రహంతో, షరతులను పాటించి, తిరుసభ నిధినుండి ఆ పరిపూర్ణ ఫలాలను, పొందమని పోపుగారు

ఆహ్వానించారు. అన్ని షరతులను పాటిస్తూ, విధులను నెరవేరుస్తూ ఈ కారుణ్యక్రియలు చేపట్టినచో పాపములకు రావలసిన ఐహిక శిక్షను తొలగిస్తుంది. ఈ జూబిలీ సంవత్సరంలో రోజుకు రెండుసార్లు ఈ కృపా పరిపూర్ణ ఫలాలు పొందవచ్చు. జగద్గురువుల ఆత్మీయ ఆకాంక్ష మేరకు, రెండు రాష్ట్రాల తెలుగు కతోలిక విశ్వాసులు ఈ జూబిలీ వసంతకాల సంవత్సరాన్ని అర్థవంతంగా, ఆశీర్వాదకరంగా కొనియాడాలని, తెలుగు కతోలిక పీఠకాపరులు ఈ లేఖ ద్వారా జూబిలీ **2025** పిలుపును ఆత్మీయతతో అందిస్తున్నాము. ఇది తెలుగు శ్రీసభలో క్రీస్తువైపుకు ఒక పిలుపు, ఒక మేలుకొలుపు, అనన్య అనుగ్రహాల మలుపు కావాలని ఆశిస్తున్నాము.

**పరిపూర్ణ ఫలాలు పొందు విధానాలు**

అ) చేసిన పాపాలకు నిండు మనసుతో పశ్చాత్తాప పడవలెను.

ఆ) దీక్ష తీసుకున్న వ్యక్తుల్లా నిష్టగా వ్యక్తిగత పాప సంకీర్తనం చేసి, పశ్చాత్తాపపడి దివ్య ప్రసాదం స్వీకరించాలి.

ఇ) దానధర్మ క్రియలు తరచుగా చేయాలి.

ఈ) జగద్గురువు ఫ్రాన్సిస్ గారి తలంపులు నెరవేరాలని తప్పక ప్రార్థించాలి.

ఉ) దైవార్చన గడియల ప్రార్దించడం చేయాలి.

ఊ) రోమా పట్టణంలోని పాపు గారి బృహద్ దేవాలయాల సందర్శించుట.

ఋ) పవిత్ర భూమి (హెూలీ ల్యాండ్) లోని బృహద్దేవాలయాల సందర్శన.

ౠ) భారతదేశంలోని, తెలుగు రాష్ట్రాల్లోని పుణ్యక్షేత్రాల, నిర్దిష్ట జూబిలీ దేవాలయాల సందర్శన.

ఎ) తీర్థయాత్రలు చేయలేని వారు కూడా పాపపరిహార పరిపూర్ణ ఫలాలను పొందుటకు నిండు మనసుతో తన పాపాలకై పశ్చాతాపడాలి, పాపసంకీర్తనం చేయాలి.

ఏ) దేవాలయానికి వెళ్లి పూజల్లో పాల్గొనలేని విశ్వాసులు కనీసం ఆధ్యాత్మికంగా పూజలో పాల్గొని వరప్రసాదాలను స్వీకరించాలి.

ఐ) తపో కార్యక్రమాలు చేస్తూ, సువార్త సేవా పరిచర్యలకు తోడ్పడాలి. తపోజీవనం, ఉపవాసం, దానధర్మాలు, మానవ జీవ పరిరక్షణ, మున్నగునవి చేయాలి.

ఒ) దైవార్చనల్లో, పీఠకాపరులు ఇచ్చే జూబిలీ ప్రత్యేక ఆశీర్వాదాలు పొందుట

ఓ) ప్రతీపీఠంలో జూబిలీ నిర్దిష్ట దేవాలయాల, పాప విమోచన గురువుల కేంద్రాల ఏర్పాట్లను వినియోగించుకోవాలి.

పైన పేర్కొన్న కారుణ్యక్రియలు, భక్తి కృత్యాలు వ్యక్తిగత పాపపరిహారం ఇతరుల ఆధ్యాత్మిక శ్రేయస్సు మరియు ఉత్తరించు ఆత్మల విమోచనకు తోడ్పడుతాయి. దేవుని కృపాకారుణ్య ప్రేమానుగ్రహాలను అందిస్తాయి!

ఈ **2025** అనుగ్రహ సంవత్సరంలో మనలో మిణుకుమిణుకుగా ఉన్న సహజ ఆశాభావం, క్రైస్తవ నిరీక్షణతొ కలసిపోయి ఒక జ్వాలగా మండుతూ, తెలుగు శ్రీసభ సంఘాలలో, గురుమండలాలల్లో, కుటుంబాలల్లో, వెరసి ప్రతి విశ్వాసిలో నిరాశ చికట్లను పారద్రోలి, కారు చీకట్లలో కాంతిరేకల్లా జూబిలీ వెలుగులు నింపును గాక! కతోలికులందరూ క్రీస్తు జ్యోతుల్లా దేదీప్యమానంగా ప్రకాశిస్తూ, తెలుగు ప్రాంతీయ శ్రీసభలో దివ్య కాగడాలుగా విలసిల్లాలని ఆశీర్వదిస్తున్నాం. అందరం సమష్టిగా, పట్టువిడవక ప్రార్థించుదాం (లూకా **18:1**). గీతసంగీత నాదాలతో దేవుని స్తుతించుదాం (కీర్తన **44:33**)! దేవదేవునికే మహిమ చెల్లుగాక! పూజా ప్రార్థనలతో మాధవుని, సేవా కార్యక్రమాలతో మానవ సేవలో తరిద్దాం!

తెలుగు ప్రాంతీయ శ్రీసభ మండుచున్న జ్యోతియై వర్ధిల్లుగాక!! తథాస్తు, ఆమెన్

తెలుగు కతోలిక శ్రీసభ పీఠకాపరుల మండలి

తేదీ:**29-12-2024**